క్లుప్తంగా

ప్రత్యేకాధికారి సమీక్ష


మాట్లాడుతున్న సుబ్బారెడ్డి

మనుబోలు: ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 13 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు వాటిని మూడు రైస్‌మిల్లులతో అనుసంధానం చేశామని తెలిపారు. రైతులకయ్యే రవాణా, హమాలీ, గోతాల ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ సుబ్బయ్య, వ్యవసాయ శాఖ ఏడీ శివనాయక్, ఏఓ జహీర్ తదితరులు పాల్గొన్నారు.

హుండీ కానుకల లెక్కింపు

ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి అమ్మవారి ఆలయ హుండీ కానుకలను శుక్రవారం లెక్కించారు. ప్రధాన హుండీలో రూ.4,01,092, అన్నదాన హుండీలో రూ.34,787 మొత్తాన్ని భక్తులు సమర్పించారని ఈఓ తాతా శ్రీనివాసరావు తెలిపారు. నెల్లూరు సంతపేటలోని ఆంజనేయస్వామి దేవస్థాన ఈఓ రఘురామయ్య పర్యవేక్షించారు.

మూగజీవాలకు టీకాలు

రాపూరు: మండలంలోని సిద్ధవరం గ్రామంలో గాలి కుంటు వ్యాధి సోకకుండా ఉండేందుకు మూగజీవాలకు శుక్రవారం టీకాలు వేసినట్లు వెటర్నరీ అసిస్టెంట్ రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి సోకితే పాల దిగుబడి తగ్గిపోతుందన్నారు. గ్రామంలో 500 జీవాలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది పెంచలరెడ్డి, భవాని, రైతులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 308 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 308 పొగాకు బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 320 బేళ్లు రాగా, అందులో 308 బేళ్లను విక్రయించామని చెప్పారు. మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.265, సగటు ధర రూ.278.34 పలికిందని వివరించారు. వేలంలో 40,170 కిలోల పొగాకును విక్రయించగా రూ.1,11,81,290 వ్యాపారం జరిగిందని తెలిపారు. కాగా వేలంలో ఏడు కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి స్వల్పగాయాలు


దెబ్బతిన్న కారు

సంగం: మండలంలోని ర్యాంపు సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్వల్ప గాయాలపాలయ్యారు. వివరాలు..ఆత్మకూరు నుంచి నెల్లూరు వైపు పుచ్చకాయల లోడుతో వెళ్తున్న మినీ వ్యాన్‌ను సంగం వైపు వస్తున్న కారు ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినగా అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మద్దతు ధర కల్పించేలా చర్యలు


ధాన్యాన్ని పరిశీలిస్తున్న సోమిరెడ్డి

వెంకటాచలం: రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించేలా చర్యలు చేపడుతున్నామని, ఎవరూ తక్కువ ధరకు అమ్ముకోవద్దని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. మండలంలోని గొలగమూడిలో కొనుగోలు ప్రక్రియను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల మాయలో పడకుండా ఓపిగ్గా వ్యవహరించి ప్రభుత్వ కేంద్రాల్లో విక్రయించాలని తెలియజేశారు. 24 గంటల్లోనే బ్యాంక్ ఖాతాల్లో నగదు జమవుతుందన్నారు. దళారులు, రైసుమిల్లర్లు, అధికారులు రైతులను ఇబ్బందులు పెడితే సహించే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కల్పన, మండల వ్యవసాయశాఖాధికారి హరికరుణాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్వా రంగంపై పట్టు కోసం..

మత్స్య విద్యార్థుల క్షేత్ర సందర్శన

- ఫివెప్ ప్రోగ్రాంలో భాగంగా..
- వివిధ జిల్లాల్లో పర్యటన

ఆక్వా రంగం.. దీనిపై ఎన్నో లక్షల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. మత్స్య ఉత్పత్తులకు సంబంధించిన టర్నోవర్ రూ.కోట్లలో ఉంటుంది. ఈ రంగంలో మార్పులు, సమస్యలు తదితర అంశాలను తెలుసుకునేందుకు ముత్తుకూరు మత్స్య కళాశాల విద్యార్థులు గ్రామాలబాట పట్టారు. భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా తయారయ్యేందుకు ఈ కార్యక్రమం వారికి ఎంతో ఉపయోగపడనుంది.


టేకు చేపలను పరిశీలిస్తున్న మత్స్య కళాశాల విద్యార్థులు

ముత్తుకూరు: సర్వేపల్లి నియోజకవర్గంలోని ముత్తుకూరులో మత్స్య కళాశాల ఉంది. విద్యార్థులను ఆక్వా రంగంలో శాస్త్రవేత్తలుగా తయారు చేసేందుకు కృషి చేస్తోంది. దీనికి ఫిషరీస్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ – ఫివెప్ (మత్స్య కృషి అనుభవ పథకం) ప్రోగ్రాం బాసటగా నిలుస్తోంది. బీఎఫ్ఎస్సీ (బ్యాచలర్ ఆఫ్ ఫిషరీస్ సైన్స్) 4వ (చివరి) సంవత్సరం చదువుతున్న వారు ప్రస్తుతం గ్రామాల్లో ఆక్వా రంగాన్ని ప్రత్యక్షంగా అధ్యయనం చేస్తున్నారు. ఆక్వా రైతుల కష్టనష్టాలను, రొయ్యలు, చేపల పెంపకంలో ఒడిదుడుకులను స్వయంగా పరిశీలిస్తున్నారు.

ఎందుకంటే..

మత్స్య కళాశాలలో మూడేళ్ల పాటు థియరీ నేర్చుకున్న విద్యార్థులు చివరి సంవత్సరంలో నాలుగు నెలలపాటు క్షేత్ర సందర్శన చేస్తారు. ఇందులో ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సవాళ్లపై అధ్యయనం చేయాలి. మొత్తం 8 సెమిస్టర్లలో 7వ సెమిస్టర్ కింద క్షేత్ర స్థాయిలో పర్యటన, పరిశీలన ఉంటుంది. కళాశాలలో 6 సెమిస్టర్లలో నేర్చుకున్న వివిధ కోర్సులను ఫివెప్ పథకంలో స్వయంగా అధ్యయనం చేస్తారు. ఆక్వా రంగంలో చెరువులు (చేపలు – రొయ్యలు), హేచరీలు, ప్రాసెసింగ్ ప్లాంట్లు, ఫీడ్ ప్లాంట్లు, ల్యాబ్‌లు, మార్కెట్లు, గిడ్డంగులు తదితర రంగాలను స్వయంగా పరిశీలించి, అవగాహన పెంచుకుంటారు. ఒక్కో విభాగంలో వారం నుంచి నెల వరకు అధ్యయనం చేస్తారు. రొయ్యల ప్రాసెసింగ్, మేత తయారీ, లార్వా రవాణా, క్వాలిటీ మేనేజ్‌మెంట్, చెరువుల తయారీ, నీటి యాజమాన్యం తదితర వాటి గురించి తెలుసుకుంటారు.

32 మంది..

ప్రస్తుతం కళాశాలకు చెందిన చివరి సంవత్సరం బీఎఫ్ఎస్సీ విద్యార్థులు 32 మంది నెల్లూరు, బాపట్ల, ప్రకాశం, తూర్పుగోదావరి జిల్లాల్లో క్షేత్ర పరిశీలనకు వెళ్లారు. అంతేకాకుండా సముద్రంలో మత్స్యకారులు బోట్లు నడపడం, వలలు విసరడం, వలల తయారీ తదితర అంశాలను కూడా క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు..



ఆక్వా రంగంలోని అన్ని విభాగాలను స్వయంగా పరిశీలించి, అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థులు భవిష్యత్‌లో ఉత్తమ శాస్త్రవేత్తలుగా తయారవుతారు. ఎంబీబీఎస్ చేసిన విద్యార్థులు హౌస్ సర్జన్ చేస్తున్న విధంగా మత్స్య శాస్త్ర విద్యార్థులు తప్పనిసరిగా ఫివెప్ పథకంలో ఆక్వా రంగంలో అనుభవం గడించాలి.

– డాక్టర్ బాలసుబ్రమణియన్, అసోసియేట్ డీన్, మత్స్య కళాశాల


ల్యాబ్‌లో పరిశోధన చేస్తూ..

కాకాణిని కలిసిన మైనార్టీ నాయకులు


కాకాణితో మాట్లాడుతున్న నేతలు

ముత్తుకూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని స్థానిక మైనార్టీ నాయకులు శుక్రవారం నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో కలిశారు. ఎంపీటీసీ సభ్యుడు షేక్ నవీద్‌బాషా, షేక్ రహీం సాహెబ్, జావీద్ తదితరులు ఆయన్ను కలిసి రంజాన్ సందర్భంగా ముత్తుకూరులో ఆదివారం తలపెట్టిన ఇఫ్తార్ విందుకు ఆహ్వానించారు.

పది పరీక్షలకు 672 మంది హాజరు

ముత్తుకూరు: మండలంలోని నాలుగు కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్టుగా ఎంఈఓ మధుసూదన తెలిపారు. ఇంగ్లిష్ ఎగ్జామ్‌కు 678 మందికి గానూ 672 మంది విద్యార్థులు హాజరయ్యారని వెల్లడించారు.

ఇందుకూరుపేట: పదో తరగతి పరీక్షలకు ఏడుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ వెంకటేశ్వరనాయక్ తెలిపారు. ఎమ్కేఆర్ ఉన్నత పాఠశాలలో ఐదుగురు, జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారని చెప్పారు.

నిమ్మతోట కంచె దహనం

- రూ.3 లక్షల ఆస్తి నష్టం


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పొదలకూరు: పొదలకూరు పంచాయతీ మజరా గ్రామం లింగంపల్లికి చెందిన అనమాల వెంకట్రామిరెడ్డి నిమ్మతోట కంచె శుక్రవారం తెల్లవారుజామున కాలిపోయింది. దట్టంగా మంటలు వ్యాపిస్తుండగా గుర్తించి పొదలకూరు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని నిమ్మచెట్లకు మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు. అయితే కంచె కాలిపోవడంతో సుమారు రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్టు బాధితుడు వెల్లడించారు. ఈ ఘటన ప్రమాదవశాత్తు జరిగిందా? లేక గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా? అనేది తెలియాల్సి ఉంది. పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు వెంకట్రామిరెడ్డి వెల్లడించారు.

స్కే పోటీల్లో విజేతలకు అభినందన



బుచ్చిరెడ్డిపాళెం: నెల్లూరులోని టౌన్‌హాల్లో నిర్వహించిన స్కే మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి టోర్నీలో అండర్ – 10, 12 విభాగాల్లో ప్రతిభ చూపి స్వర్ణ పతకాలను సాధించిన స్థానిక శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులను మున్సిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ అభినందించారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహించిన ప్రిన్సిపల్ రామాంజనేయులు, డీన్ శీను, ఇన్‌చార్జి రాధతో పాటు స్కే మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర సెక్రటరీ ఇబ్రహీంను అభినందించారు. కమిషనర్ బాలకృష్ణ, వైస్ చైర్మన్లు యరటపల్లి శివకుమార్‌రెడ్డి, నస్రీన్‌ఖాన్, కౌన్సిలర్లు పుట్టా లక్ష్మీకాంతమ్మ, రహమత్‌బాషా, రాచూరి సత్యనారాయణ, కత్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలుంటే చెప్పండి


రైతులతో మాట్లాడుతున్న సత్యవాణి

- జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి పి.సత్యవాణి

కొడవలూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏవైనా సమస్యలుంటే చెప్పాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి పి.సత్యవాణి రైతులను కోరారు. మండలంలోని రామన్నపాళెం, మానేగుంటపాడు కేంద్రాలను శుక్రవారం ఆమె పరిశీలించి రైతులతో మాట్లాడారు. తేమ శాతంలో మినహాయింపు ఇవ్వడం జరిగిందన్నారు. దీనిపై సరైన అవగాహన లేకపోవడంతో రైతులు కొనుగోలు కేంద్రాలకు దూరమవుతున్నారని తెలిసిందన్నారు. బీపీటీ లాంటి వరి ధాన్యానికి మార్కెట్‌లో తక్కువ ధర ఉన్నందున ఆ రకాన్ని విధిగా కొనుగోలు కేంద్రంలోనే విక్రయించుకోవాలని సూచించారు. ఆమె వెంట ఏఓ సీహెచ్ఎస్ లక్ష్మి, ఏఈఓ పి.వెంకట్రావు, సొసైటీ సీఈఓ కృష్ణ, వీఏఏలు ఆర్.నిహారిక, డి.శివజ్ఞాన, నాయకులు కాకి శ్రీనివాసులు, నిశ్చల్‌రెడ్డి ఉన్నారు.

రొయ్యల ఫ్యాక్టరీలో కొనసాగుతున్న తనిఖీలు


ఆంజనేయ సీ ఫుడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌లో జేఏసీ తనిఖీ

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న ఆంజనేయ సీఫుడ్స్ రొయ్యల ఫ్యాక్టరీలో జేఏసీ (జాయింట్ యాక్షన్ కమిటీ) అధికారులు శుక్రవారం కూడా తనిఖీ చేశారు. జిల్లాలోని 12 రొయ్యల ఫ్యాక్టరీల్లో ఇతర రాష్ట్రాల మైనర్ బాలికలతో పని చేయిస్తున్నారని కలెక్టర్ ఆనంద్‌కు ఫిర్యాదులందాయి. దీంతో స్పందించిన కలెక్టర్ రొయ్యల ఫ్యాక్టరీల్లో తనిఖీలు నిర్వహించాలని జేఏసీని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలపై ఆంజనేయ సీఫుడ్స్ ఫ్యాక్టరీలో శుక్రవారం జేఏసీ సభ్యులు విస్తృత తనిఖీలు చేశారు. రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లోకి వెళ్లి అక్కడ పని చేస్తున్న వారి ఆధార్ కార్డులను పరిశీలించారు. ఫేక్ ఆధార్ కార్డులతో మైనర్‌లు పని చేస్తున్నారన్న అనుమానంపై పలువురిని గుర్తించారు. వీరిని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు పంపి పరీక్షించి వయస్సు నిర్ధారించడం జరుగుతుందని జేఏసీ సభ్యులు తెలిపారు. 18 ఏళ్లలోపు బాలికలు ఉన్నట్లు నిర్ధారణైతే యాజమాన్యంపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. జేఏసీ సభ్యులు ఐసీడీఎస్ చైర్ పర్సన్ మాధవి, బాలల సంరక్షణాధికారి సురేష్, కొడవలూరు వైద్యాధికారి ఎం.రామకృష్ణ, లేబర్, పోలీసు, ఫ్యాక్టరీలు, సీడబ్ల్యూసీ, మత్స్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

టైలర్ ఇంట్లో చోరీ

పొదలకూరు: పట్టణంలోని ఎమ్మార్వో కాలనీలో నివాసం ఉంటున్న చాముండేశ్వరి టైలర్ ఇంట్లో దొంగతనం జరిగిందని ఫిర్యాదు అందడంతో ఎస్సై హనీఫ్ గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. రూ.5 వేలు నగదు, టైలరింగ్ చేసిన దుస్తులు చోరీకి గురైనట్టు పేర్కొన్నారు. ఈ కేసులో కాలనీకి చెందిన పెంచలయ్యను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్టు ఎస్సై తెలిపారు.

గ్రంథాలయ సంస్థకు రూ.47 కోట్ల సెస్ బకాయిలు

పొదలకూరు: జిల్లాలో మున్సిపాలిటీలు, పంచాయతీల ద్వారా జిల్లా గ్రంథాలయ సంస్థకు రూ.47 కోట్లు బకాయిల రూపంలో వసూలు కావాల్సి ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కుమార్‌రాజా పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్టు తెలిపారు. సకాలంలో బకాయిలు అందని కారణంగా తమ సిబ్బందికి జీతాలను రెండు నెలలుగా చెల్లించలేదన్నారు. ఈనెల 11న సెస్ బకాయిలపై మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహించినట్టు చెప్పారు. త్వరలో బకాయిలందే అవకాశం ఉందన్నారు. గ్రంథాలయాల్లో కంప్యూటర్లను ఏర్పాటు చేసి, ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. లైబ్రరీలను ఆయా పంచాయతీల్లో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రేషన్ కార్డుదారులు ఈ - కేవైసీ చేయించుకోవాలి

నెల్లూరు(పొగతోట): రేషన్‌కార్డులు కలిగిన వారు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని డీఎస్ఓ అంకయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం, చౌక దుకాణాల డీలర్లను సంప్రదించి ఈ ప్రక్రియను చేయించుకోవాలని సూచించారు. ఐదు సంవత్సరాల్లోపు వయసున్న పిల్లలకు మినహాయింపు ఇచ్చారని తెలియజేశారు.

కార్పొరేషన్ షాపులకు వేలం

నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ షాపులకు సంబంధించిన వేలాన్ని చిన్నబజార్‌లోని ఏసీ సుబ్బారెడ్డి షాపింగ్ కాంప్లెక్స్‌లో నిర్వహించామని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు శుక్రవారం తెలిపారు. ప్రక్రియకు పది మంది హాజరయ్యారని చెప్పారు. 13 షాపులకు గానూ మూడింటిని దక్కించుకున్నారన్నారు. రెవెన్యూ అధికారి ఇనాయతుల్లా, రెవెన్యూ విభాగ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ' విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలకు చెందిన 93 మంది విద్యార్థినులకు రూ.ఎనిమిది లక్షల స్కాలర్‌షిప్‌ను మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఆధ్వర్యంలో శనివారం అందజేయనున్నామని ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనను శుక్రవారం విడుదల చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఇందుకూరుపేట: ఎన్వీ గార్డెన్స్‌లోని విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల నేపథ్యంలో పల్లిపాడు సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని డీఈఈ సురేంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ఎల్లవేళలా అందుబాటులో ఉంటా


తోటపల్లిగూడూరు మండల నేతలు, కార్యకర్తలతో సమావేశమైన కాకాణి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): సర్వేపల్లి నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. డైకస్‌రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో తోటపల్లిగూడూరు మండల నేతలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా, నష్టం వాటిల్లినా అన్ని విధాలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో విధ్వంసకర పాలన సాగుతోందని, గ్రామస్థాయిలో సమస్యలను తెలుసుకోవాలనే ఉద్దేశంతో మండలాల వారీగా సమావేశాలను నిర్వహిస్తున్నానని చెప్పారు. ప్రజలకు ఎలాంటి సమస్యలొచ్చినా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అప్పటికీ పరిష్కారం కాకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని ప్రకటించారు. పార్టీ నేతలు, కార్యకర్తలపై వివక్ష చూపుతూ ఇబ్బందులకు గురిచేస్తున్న వారిని వదిలేదిలేదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి మారుపేరుగా గ్రామాలు నిలిచాయని, అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వ అవినీతి పాలనలో దోపిడీకి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం చురుగ్గా పనిచేసే సమర్థ కార్యకర్తలకు వివిధ స్థాయిల్లోని పార్టీ కమిటీల్లో స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ధాన్యాన్ని విక్రయించేందుకు రైతులు అనేక పాట్లు పడుతున్నారన్నారు. జగనన్న 2.0లో నేతలు, కార్యకర్తలకు అధిక ప్రాధాన్యమివ్వనున్నారని చెప్పారు.

మహిళపై దాడి చేశారని ఫిర్యాదు


ఫిర్యాదు చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

మనుబోలు: ఎస్సీ కులానికి చెందిన ఓ మహిళపై నలుగురు వ్యక్తులు దాడి చేశారంటూ కుల వివక్ష పోరాట సమితి అధ్యక్ష కార్యదర్శులు రఘురామయ్య, తిరుపాలు శుక్రవారం స్థానిక పోలీసులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరంపల్లి పంచాయతీ కొండుపాళెం గ్రామానికి చెందిన గుండుపాక మీరమ్మ గురువారం రాత్రి తన పొలంలో వరి పంటను ట్రాక్టర్‌లో తీసుకొస్తుందన్నారు. దారిలో అదే గ్రామానికి చెందిన ఆనాల శీనయ్య, ఆనాల సతీష్, ఆనాల లలితమ్మ, వారి బంధువు వాసు కలిసి మీరమ్మను తిడుతూ దుస్తులు చింపి దాడి చేశారని తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట సీపీఎం నాయకుడు దేవదానం ఉన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న డీఆర్వో

కలువాయి(సైదాపురం): అడవులను సంరక్షించుకుందామని రాపూరు రేంజ్ డీఆర్వో కాజారసూల్ పిలుపునిచ్చారు. మండలంలోని కుల్లూరు ఎస్టీ కాలనీలో గురువారం రాత్రి కళా బృందంతో అడవులను కాపాడుకునే విధానంపై ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డీఆర్వో మాట్లాడుతూ కుందేళ్లు, దుప్పులు, అడవి పందులను కరెంట్ పెట్టి చంపడం నేరమన్నారు. అడవికి నిప్పు పెడితే మానవాళి మనుగడకు ముప్పు ఏర్పడుతుందన్నారు. ఎవరైనా అడవులకు హాని చేస్తే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌బీఓ నాగులు, రాహుల్, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వార్షికోత్సవం


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న సీఐ

రాపూరు: రాపూరు సమీపంలోని మద్దెలమడుగు వద్ద ఉన్న ప్రభుత్వ డిగ్రీకళాశాల 41వ వార్షికోత్సవాన్ని కళాశాల సిబ్బంది, విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాపూరు సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో చదివి తమ లక్ష్యాలను సాధించాలన్నారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటరాజేష్, కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.